నేటి కందం- నేటికి అందం

సుంకమ్మును పెంచిననూ
గొంకని భారతమును గని కూలం బడుచున్
బింకమును ట్రంపు వీడుచు
సుంకము తగ్గించుచున్న సూచన జేసెన్ !!

(మన భారత దేశం మీద వేసిన సుంకాలను మరలా తగ్గించ పూనూకున్నట్లుగా ట్రంపు సూచన చేశాడు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

వైఫల్యం తమరిదైతే
వాళ్లనంటరెందుకు
నెహ్రూ మీద నెట్టివేస్తే
నడుస్తారా ముందుకు.
ప్రాజెక్టులు పరిశ్రమలు
ప్రజాస్వామ్య ప్రగతిపథం
నాడు తప్పు ఏ ఒక్కటి
నేడు చేసి అంటే హితం

-వేల్పుల నారాయణ
9440433475



website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 16-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:80 పేజీలు:6 వెల: రూ.1/-

# 15 ఏళ్ల కల నెరవేరింది

## -గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ లో నిర్మాత..
## -ట్రైలర్ విడుదల
## -సినిమా తేదీ ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 15: నిర్మాత కె.ఎల్.నారాయణ మాట్లాడుతూ తన కల నెరవేరిందని అన్నారు. ఈ రోజు రాత్రి ఎనిమిది గంటలకు రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా





గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ ప్రారంభ మైంది. ఆయన మాటల్లోమహేశ్ బాబు, రాజమౌళి కాంబినేషన్ లో సినిమా తియ్యాలని 15 ఏళ్ల క్రితం అడిగాను. అప్పుడే మహేశ్ బాబు ఒకే చేశారు. 15 ఏళ్ల కల నేటికి నెరవేరింది. రాజమౌళి కమిట్మెంట్ గురించి వివరించారు. మహేశ్ బాబు కు ధన్యవాదాలు .

ఈవెంట్ కు ఇలా ఎంటర్ అయ్యారు

ప్రిన్స్ మహేశ్ బాబు ప్రవేశించిన వెంటనే అభిమానులు కేరింతలు పెట్టారు. వెదక దగ్గరకు రాగానే

మహేశ్ బాబు కూతురు సితార గట్టిగా పట్టి చిరునవుతో సందడి చేసింది.

మలయాళ నటుడు పృథ్వీ రాజ్ సుకుమార్ దంపతులు ప్రవేశిస్తున ప్పుడు అభిమానులు కేరింతలు కొట్టారు. వేదిక దగ్గర కు వచ్చిన వారికి నమ్రతా, సితార తన శైలి లో విష్ చేశారు.ప్రియాంక చోప్రా నవ్వుతూ అభిమానులకు అభి వాదం చేస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు.

తొలుత సినీ దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి, రచయిత విజేంద్రప్రసాద్, మహేశ్ బాబు భార్య నమ్రతా తదితరులు హాజరయ్యారు.

# జమ్మూ కశ్మీర్ నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో పేలుడు తొమ్మిది మంది మృతి

జమ్మూ కశ్మీర్ నవంబర్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జమ్మూ కశ్మీర్ నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన బ్లాస్ట్‌పై కేంద్ర హోంమంత్రిత్వశాఖ స్పందించింది. ఈ పేలుడు ఘటనలో తొమ్మిది ప్రాణాలో కోల్పోయారని.. 27 మంది పోలీసులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారని పేర్కొంది. నౌగామ్ పేలుడుపై మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (జమ్మూ కశ్మీర్ డివిజన్) ప్రశాంత్ లోఖండే మాట్లాడుతూ.. పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనం, చుట్టుపక్కల ఉన్న కొన్ని నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఊహాగానాలను నమ్మకూడదన్నారు. శుక్రవారం రాత్రి 11:20 గంటల ప్రాంతంలో నౌగామ్ పోలీస్ స్టేషన్ లోపల దురదృష్టకర ప్రమాదవశాత్తూ పేలుడు సంభవించిందని ఆయన అన్నారు. టెర్రర్ మాడ్యూల్ దర్యాప్తు సమయంలో పేలుడు పదార్థాలు, రసాయనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లోని బహిరంగ ప్రదేశంలో సురక్షితంగా నిల్వ చేశారన్నారు. ప్రామాణిక దర్యాప్తు విధానంలో భాగంగా నమూనాలను సేకరిస్తున్న సమయంలో పేలుడు జరిగిందన్నారు. ఫోరెన్సిక్ టెస్ట్ కోసం నమూనాలను సేకరిస్తుండగా ఈ దుర్ఘటన జరిగిందన్నారు. హర్యానా ఫరీదాబాద్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు అస్థిరంగా, సున్నితంగా ఉన్నాయని.. ఈ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ లోఖండే పేర్కొన్నారు. నమూనాలు సేకరిస్తున్న సమయంలో అకస్మాత్తుగా పేలుడు సంభవించినట్లుగా చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై దర్యాప్తు కొనసాగుతోందని.. పేలుడులో గాయపడ్డ వారికి వెంటనే వైద్య చికిత్స కోసం తరలించినట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతుం దన్నారు. ఈ సమయంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం సంఘీభావం తెలుపుతుందన్నారు.

# మరో అల్పపీడనం.. మళ్లీ భారీ వర్షాలు..

అమరావతి, నవంబర్ 15:నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరప్రాంతంలో అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. అల్పపీడనం కారణంగా సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని ఆయన వెల్లడించారు. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ- వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని పేర్కొన్నారు. సోమవారం రోజు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, కడప జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

మంగళవారం నాడు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. అలాగే ప్రకాశం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వెల్లడించారు. దీని ప్రభావంతో దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. సోమవారం వరకూ మత్స్యకారులెవరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

నవంబర్ 21 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ సమాచారం ప్రకారం.. నవంబర్ 24 నుంచి 27 వరకూ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. పశువుల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్.

# కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు.. సూరత్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ, నవంబర్ 15:బీహార్ ఎన్నికలు కులతత్వ విషాన్ని తిరస్కరించాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్ సూరత్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విరుచుకుపడుతూనే.. గుజరాత్‌లో నివసిస్తున్న బీహార్ ప్రజలను ఆయన పలకరించారు. ప్రధాని మాట్లాడుతూ.. బీహార్ ప్రజలను కలవకుండా సూరత్‌ను వదిలి వెళ్తే.. ప్రయాణం వృథా అయినట్లుగా అనిపిస్తుందన్న ఆయన.. గుజరాత్‌లో ముఖ్యంగా సూరత్‌లో నివసిస్తున్న బీహారీ సోదరుల మధ్యకు వచ్చి ఈ విజయోత్సవంలో భాగం కావడం తన బాధ్యత అన్నారు. బీహార్ ప్రజలకు రాజకీయాలు నేర్పించాల్సిన అవసరం లేదని, వారు ప్రపంచానికి రాజకీయాలు నేర్పిస్తారన్నారు.

బీహార్ కుల ఆధారిత రాజకీయాలను తిరస్కరించిందన్న ఆయన.. బీహార్ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా బీహార్ ప్రతిభను చూస్తారన్నారు. మా ప్రాథమిక ఆలోచన దేశం ముందు అని.. గత రెండు సంవత్సరాలుగా ఈ బెయిలబుల్ నాయకులు బీహార్‌కు వెళ్లి కులతత్వాన్ని ప్రకటిస్తున్నారని విమర్శించారు. తమ శక్తినంతా ఉపయోగించి కులతత్వ విషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించారని.. కానీ ఈ బీహార్ ఎన్నికలు ఈ కులతత్వ విషాన్ని పూర్తిగా తిరస్కరించారన్నారు. ఈ ఎన్నికల్లో, విజయవంతమైన ఎన్‌డీఏ కూటమికి, ఓడిపోయిన మహా కూటమికి మధ్య 10 శాతం ఓట్ల తేడా ఉందని.. ఇది ముఖ్యమైన విజయమన్నారు. దీని అర్థం సాధారణ ఓటర్లు ఏకగ్రీవంగా ఓటు వేశారని.. ఇది బీహార్ అభివృద్ధి పట్ల ఉన్న మక్కువను ప్రతిబింబిస్తుందన్నారు. ఎన్నికల్లో యువత, మహిళలు ప్రతిపక్ష పార్టీలకు సరైన ఇచ్చారని.. బీహార్ ప్రజలు అభివృద్ధి ఎజెండాను ఆమోదిస్తూ ప్రతిపక్షాన్ని పూర్తిగా తిరస్కరించారని.. సూరత్‌లో పనిచేస్తున్న బీహార్ ప్రజలకు ఇక్కడ పూర్తి హక్కులు ఉన్నాయన్నారు.

ఈ సందర్భంగా మోదీ వక్ఫ్ చట్టాన్ని ప్రస్తావించారు. ఇళ్లను అక్రమంగా ఆక్రమించి వక్ఫ్ ఆస్తులుగా మార్చారని.. తమిళనాడులో మొత్తం గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా మార్చారని ఆరోపించారు. అందుకే పార్లమెంటులో వక్ఫ్ చట్టాన్ని ప్రవేశపెట్టామన్నారు. బీహార్ ఎన్నికల సమయంలో ఈ హామీదారులు, వారి మిత్రులు (ప్రతిపక్షాలు) వక్ఫ్ చట్టాన్ని బహిరంగంగా చించివేశారని.. వారు అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని అమలు చేయడానికి అనుమతి ఇవ్వమని చెప్పారని.. బీహార్ ప్రజలు కూడా ఈ మత రాజకీయాలను ఓడించారని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను ఎవరూ రక్షించలేరన్న ప్రధాని.. ఈ దేశం ముస్లిం లీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్‌ను తిరస్కరించిందన్నారు. కాంగ్రెస్ చర్యలతో దేశం అసంతృప్తిగా ఉందని.. ఇకపై కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరన్నారు.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు పోల్

## -బీజేపీ, జేడీ(యూ)కి దక్కిన సీట్లు

పాట్నా నవంబర్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘటబంధన్ కూటమికి నేతృత్వం వహించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)కే ఎక్కువ ఓట్లు పోల్ అయ్యాయి. అయితే ఎన్డీయే కూటమికి చెందిన బీజేపీ, డీ(యూ)కు అత్యధిక సీట్లు దక్కాయి. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీఏ కూటమి 202 స్థానాలు గెలుచుకున్నది. చెరో 101 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 89 సీట్లు, నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) 85 సీట్లు గెలుచుకున్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 19 సీట్లు, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) 5 సీట్లు, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా 4 సీట్లలో విజయం సాధించాయి.కాగా, మహాఘటబంధన్ కూటమికి నేతృత్వం వహించిన ఆర్జేడీ 144 స్థానాల్లో పోటీ చేసింది. అయితే 25 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ 61 సీట్లలో పోటీ చేయగా కేవలం 6 స్థానాల్లో గెలుపొందింది. సీపీఐ(ఎంఎల్) రెండు సీట్లు, సీపీఐ(ఎం) ఒక సీటు దక్కించుకోగా సీపీఐ ఏదీ గెలుచుకోలేదు. దీంతో మహాఘటబంధన్ కూటమి 35 సీట్లకే పరిమితమైంది.మరోవైపు ఓటు శాతాన్ని పరిశీలిస్తే బీహార్ ప్రజలు ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు వేశారు. ఆ పార్టీ 23 శాతం ఓట్లు సాధించింది. అయితే గత ఎన్నికల్లో 23.11 శాతం ఉండగా ఈసారి స్వల్పంగా తగ్గింది. 144 స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీకి మొత్తం 1,15,46,055 ఓట్లు పోలయ్యాయి. అయితే కేవలం 25 సీట్లలోనే ఆ పార్టీ విజయం సాధించింది.

సుమారు 42 సీట్లు స్వల్ప ఓట్ల తేడాతో కోల్పోయింది.కాగా, బీజేపీ ఓట్ల శాతం ఈసారి మరింత పెరిగింది. 2020 ఎన్నికల్లో 19.46 శాతం ఉండగా ఈసారి 20.07 శాతానికి పెరిగింది. గత ఎన్నికల్లో 110 నియోజకవర్గాల్లో పోటీ చేసిన బీజేపీ ఈ ఎన్నికల్లో 101 సీట్లకే పరిమితమైంది. అయినప్పటికీ 1,00,81,143 మంది ఓటర్లు బీజేపీకి ఓటు వేశారు. జేడీ(యూ)కు 19.25 శాతం ఓట్లు పోలయ్యాయి.

# సూర్యాపేట డీఎంహెచ్ఓగా డాక్టర్ పెండెం వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట, నవంబర్ 15 : సూర్యాపేట జిల్లా డీఎంహెచ్ఓగా డాక్టర్ పెండెం వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరు మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. పొగాకు, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం అందరిని చైతన్య పరిచే కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ మహిళలకు సంభవించే కాన్సర్ వ్యాధుల నివారణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అదేవిధంగా చిన్నారులకు ఇమ్యూనైజేషన్ టీకాలను అందించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే విధంగా వైద్య శాఖ పనిచేస్తుందన్నారు.

35 సంవత్సరాలు పై బడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి ఉచిత మందుల పంపిణీతో పాటు వైద్య పరమైన సలహాలు ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలను పర్యవేక్షిస్తూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయడంతో పాటు విధుల పట్ల అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లాలోని పలువురు వైద్యాధికారులు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతించి అభినందనలు తెలిపారు.

# ఏపీలో తప్పిన మరో ప్రైవేట్ బస్సు ప్రమాదం..ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు



అమరావతి, నవంబర్ 15: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో ఓ ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామ సమీపంలో అర్ధరాత్రి రోడ్డుపై నిలబడ్డ లారీని ఢీ కొట్టింది. ఈ సమయంలో పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సులో ఉన్నారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు .

అయితే ప్రమాదం వల్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సును. లారీని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ముందు ఆగి ఉన్న లారీని బస్సు డ్రైవర్ గమనించకపోవడం, లారీని రహదారిపై నిలిచి ఉంచడంతో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గత కొద్ది రోజుల క్రితం హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ ఘటనతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి.

# అనుమానస్పద లింకులు మెసేజ్ లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలి

## -వెంటనే ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలి

హైదరాబాద్ నవంబర్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: డబ్బు పంపాలన్న మెసేజ్ లు ఎవరూ నమ్మవద్దు అని సిపి కమిషనర్ సజ్జనార్ తెలిపారు. అనుమానస్పద లింకులు మెసేజ్ లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, తన పేరుతో నకిలీ ఫేస్ బుక్ ఖాతా సృష్టించారని సజ్జనార్ తెలియజేశారు. ఆపదలో ఉన్నానని.. డబ్బు పంపాలని మెసేజ్ లు పంపిస్తున్నారని మండి పడ్డారు. ఇప్పటికే ఒక స్నేహితుడు రూ. 20 వేలు పంపి మోసపోయారని అన్నారు. సైబర్ మోసాలపై 1930 లేదా https://cybercrime.gov.in/ లో ఫిర్యాదు చేయాలని సిపి సజ్జనార్ సూచించారు.

# పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా..

## ముగ్గురు మహిళలకు గాయాలు



హైదరాబాద్, నవంబర్ 15:హైదరాబాద్ నగరంలోని పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఘోర ప్రమాదం జరిగింది. శనివారం ఉదయం వేగంగా వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని కారులో నుంచి బయటకు తీసి, ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సాయంతో కారును కూడా పక్కకు తీశారు.

ఈ ప్రమాదం అత్తాపూర్ వద్ద చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వైపు కారు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రమాదానికి అతి వేగమే కారణమన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# భారీ వృక్షాల కూల్చివేత..

మేడారంనవంబర్ 15: మేడారం మహా జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా భారీ వృక్షాలను కూల్చివేస్తున్నారు. దశాబ్దాలుగా పెంచిన చెట్లు గొడ్డలి వేటుకు బలవుతున్నాయి. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా శాశ్వత పనులు చేపడుతుండటంతో గద్దెల నుంచి ఆర్టీసీ క్రాస్ వరకు ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలను కూల్చుతున్నారు. ఇన్నాళ్లు భక్తులు వంటలు చేసుకొని పిల్ల పాపలతో ఉత్సాహంగా గడిపిన క్షణాలను భక్తులు కూల్చిన చెట్లను చూసి గుర్తు చేసుకుంటున్నారు. దశబ్దాలుగా నీడను ఇచ్చిన చెట్లను మొత్తానికి నరకకుండా ఈ చెట్లను పెకిలించి నాటాలని, పర్యావరణాన్ని కాపాడాల్సిన వారే ఈ చెట్లను నరకడం పట్ల పర్యావరణ ప్రేమికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# రియల్ ఎస్టేట్ ఆఫీస్ లో భారీ చోరీ

నాగోల్, నవంబర్ 15: ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం.. ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయం తలుపులు పగలగొట్టి పెద్ద మొత్తంలో నగదు, బంగారం దోచుకున్న ఘటన చోటుచేసుకుంది.

సీఐ వినోద్ కుమార్ కథనం ప్రకారం సాయి దత్తా హస్తినాపురం, ఓంకార్ నగర్ లోని మిలా ప్లాజా 2వ అంతస్తులో రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ రాత్రి 11 గంటలకు రియల్ ఎస్టేట్ మేనేజ్మెంట్ కార్యాలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఈ నెల 13వ తేదీన తిరుపతికి బయలుదేరారు.

ఈ నెల 14న, ఆఫీసు సెక్యూరిటీ గార్డు పి. అంజయ్య రియల్ ఎస్టేట్ ఆఫీసు యజమాని రవీందర్ గుప్తాకు ఫోన్ చేసి, కొంతమంది దుండగులు ఆఫీసు తలుపులు పగలగొట్టి ఆఫీసులోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారని చెప్పాడు.దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కార్యాలయాన్ని పరిశీలించగా లోపల అల్మారాలు పగలగొట్టి రూ.9 లక్షల నగదు, 10 తులాల బంగారు బిస్కెట్లు పోయినట్లు గుర్తించారు.

# సిరిసిల్ల వ్యవసాయ కళాశాలలో 'గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే'

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 15(నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్లలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో శనివారం 'గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే - 2025' ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పీజీటీఎస్ఏయూ మార్గదర్శకాల మేరకు "గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే-2025" కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డా. కె.బి. సునీతా దేవి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కొత్తగా చేరిన 110 మంది విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కో మొక్కను నాటి, వాటిని సంరక్షిస్తూ జియో ట్యాగ్ చేశారు. మొక్కలు సంరక్షణను తమ బాధ్యతగా స్వీకరించారు. ఫ్యాకల్టీ అడ్వైజర్లు, ఫార్మ్ సూపరింటెండెంట్, ఫార్మ్ మేనేజర్, గ్రామం సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కళాశాలలో స్థలాభావం, నీటి కొరత వంటి సవాళ్లున్నప్పటికీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందడమే కాకుండా కాలేజీలో సుస్థిర పర్యావరణ దృక్కోణం బలపడిందని అసోసియేట్ డీన్ సునీతా దేవి పేర్కొన్నారు.

# ప్రపంచ శాంతికి పునాది 'సహనశీల గుణమే' !

## (16 నవంబర్ "అంతర్జాతీయ సహన దినోత్సవం" సందర్భంగా)

సహృదయుల్లో కనిపించే ప్రధాన సుగుణాల్లో సహనశీలత ఒకటి. అహింసకు ప్రతిరూపం సహన గుణమే. ఇతరుల సంస్కృతి, వారసత్వం, జీవనసరళి, వైవిధ్యత, ఆచారవ్యవహారాలు, భావప్రకటన స్వేచ్ఛలను గౌరవించడం, విభేధాలను సానుకూలతతో అంగీకరించడం, ప్రశంసించడం మన నిత్య జీవన విధానం కావాలి. విభేధాల్లో సహితం సామరస్యత ప్రదర్శించడమే అసలైన సహనశీలతగా అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా అనేక వైవిధ్యభరిత ఆచారవ్యవహారాలు, సంస్కృతులు, భాషలు, పద్ధతులు, జాతులు, కళలు ఉన్నాయి. ఈ వైవిధ్యతలే మానవ జాతి ఎదుగుదలకు, అద్భుత ఆనందమయ అనుభవాలకు పునాదులు అవుతున్నాయి. భిన్నత్వంలో ఏకత్వ సాధన ద్వారా పరస్పర గౌరవం, సమాజాభివృద్ధి జరుగుతున్నాయి. ఇతరులు పాటించే ఆచారాలను, మత విశ్వాసాలను, కుల వారసత్వాలను గౌరవిస్తూ, సమన్వయ భావనలతో ముందుకు సాగడానికి సహనం అనే అద్భుత గుణం ఉపయుక్తం అవుతుంది. సహనశీల గుణం ద్వారా ఇతరుల మానవ హక్కులు, మౌళిక స్వేచ్ఛ పరిరక్షించబడతాయి.

అంతర్జాతీయ సహన దినోత్సవం–2025:

విశ్వ మానవాళి జీవన సరళి సహజంగానే వైవిధ్యభరితం, విలక్షణం. అయినప్పటికీ వారిని శాంతి సామరస్యాలతో కట్టి ఉంచేది దారమే సహన గుణ సంపద అని గమనించాలి. మానవ సమాజ ఏకీకరణకు, ప్రశాంత జీవన విధానాలు కొనసాగడానికి సహనం అనే గుణం ప్రధానమైనదని అంగీకరించిన ఐరాస 1995 ఏడాదిని "అంతర్జాతీయ సహన సంవత్సరం(ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ టాలరెన్స్)"గా పాటించడం, దానికి కొనసాగింపుగా 1996 నుంచి ప్రతి ఏట 16 నవంబర్ రోజున "అంతర్జాతీయ సహన దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ టాలరెన్స్)"గా పాటించడం ఆనవాయితీగా మారింది. సహన భావన మన సంస్కృతి, వారసత్వం, ఆచారాల్లో దాగి ఉంది. అంతర్జాతీయ సహన దినం వేదికగా సహనశీలత ప్రాధాన్యాన్ని వివరించడం, అహింసాయుత ఆలోచనలను తట్టిలేపడం, ఓపికను ప్రదర్శించడం, సామాజిక సామరస్యతను పాటించడం, ఇతరుల అభిప్రాయాలు/జీవన విధానాలను గౌరవించడం, ప్రపంచ మానవాళిలో సోదర భావాన్ని జాగృత పరచడం, మానవ హక్కులను పరిరక్షించడం, సహనశీలత కేంద్రంగా చర్చలు/విద్యార్థులకు పోటీలు/సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం లాంటి పలు ఆలోచనలను కార్యరూపంలోకి తేవచ్చు.

సహనశీలత ప్రాధాన్యం:

నేటి ప్రపంచంలో ఏ మూలన చూసిన అశాంతి, సంఘర్షనలు, తీవ్రవాద ధోరిణులు, ఉగ్రవాద రక్తపాతాలు, మత ఘర్షనల మంటలు, కులాల కుమ్ములాటలు, మానవ హక్కుల హననాలు, యుద్ధాలు, సంస్కృతిక విభేదాలు, వేర్పాటువాద హింసలు, ప్రాంతీయ తత్వాలు కొనసాగుతూనే ఉన్నాయి. అసహనం రెక్కలు విచ్చుకొని పేట్రేగిపోతున్నది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ మానవాళి శాంతి, సమన్వయం, సౌభ్రాతృత్వ బాటలో నడవడానికి సహనమనే ఏకైక సాధనం మాత్రమే అవసరమని ఐరాస భావిస్తున్నది. సహనగుణాలను పెంచడానికి ప్రపంచ దేశాలు కృషి చేయాలని, విద్యలో భాగంగా చిన్నతనం నుంచే సహన బీజాలను చిన్నారుల మనోఫలకాలపై నాటాలని, సమ్మిళిత అభివృద్ధి, అవకాశాలకు పెద్ద పీట వేయాలని అంతర్జాతీయ సహన దినం బోధిస్తున్నది. ఇతరుల ఆచారాలను పాటించక పోయినా వారి భావనలను గౌరవిస్తూ అంగీకరించడమే ప్రపంచ శాంతి స్థాపనకు పెట్టుబడి అని మరిచిపోరాదు.

జీవితాలను సానుకూలంగా మార్చగల పాఠాలు:

అంగీకారం, సహనం, క్షమాగుణం, కరుణ, దయ, పరస్పర గౌరవాలు మానవ జీవితాన్ని సుసంపన్నం చేస్తాయని నమ్మడం మన కనీస కర్తవ్యం. అందరికీ జీవించే హక్కు సమానంగా ఉంది. పౌర సమాజం, వివిధ మానవ జాతులు తమ వైవిధ్యభరిత జీవన విధానాలను శాంతియుతంగా కొనసాగించడానికి ప్రతి ఒక్కరిలో సహనగుణం మెల్కొనాలి. విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం, సమన్వయ భావనలను ప్రదర్శించడం, అందరూ ఒక్కటే అన్న ఆలోచనలకు పట్టాభిషేకాలు చేయడం, వివక్షను తరిమేయడం, ఇతరుల భావాలను గౌరవిస్తూ అంగీకరించడం, సంకుచిత ఆలోచనలను పాతరేయడం లాంటి సహజీవన పాఠాలను నేటి డిజిటల్ యుగపు నరులు వంటపట్టించుకొని రేపటి ఆనందమయ శాంతియుత సమాజ క్షేత్రంలో సహన బీజాలను నేడే నాటాలని ప్రపంచ పౌర సమాజం గుర్తుంచుకొని, ఆ భవ్యమైన – దివ్యమైన దారిలో నడవడానికి సంకోచించవద్దు.

సహనానికి సంకెళ్లు వేస్తే హింసాగ్ని ప్రజ్వరిల్లుతుంది. అసహనం అంటరానిదని, పరస్పర గౌరవ భావనలను అలవాటు చేసుకోవాలని ఐరాస ఆశిస్తున్నది. అసహనాన్ని ఆమెడ దూరం తరిమి, అంగీకార ఆలోచనలను దరికి చేర్చుకొని రేపటి ప్రపంచ మానవాళికి సహనశీల శాంతియుత సహజీవన సూత్రాలను బోధిద్దాం, ఆచరణలో పెట్టే విధంగా అవిరళ కృషి చేద్దాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# విద్యకు నైపుణ్యాలు తోడైతేనే ఉజ్వల భవిష్యత్తు

## –డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు



న్యూఢిల్లీ, నవంబర్ 15:మనం నేర్చుకునే విద్యకు తగిన నైపుణ్యాలు తోడైనపుడు మాత్రమే ఆకర్షణీయ వేతనం కలిగిన ఉద్యోగాలు లభిస్తాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆచార్య కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు శ్రీకృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రథమ సంవత్సరం బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మ్ డి విద్యార్థినీవిద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో నైపుణ్య విద్య కలిగిన యువతకు ఉజ్వల భవితతో పాటు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మనలో దాగిన బలహీనతలను తగ్గించుకుంటూ, బలాలను పెంచుకుంటూ పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన ఉత్తముడిగా ఎదగాలన్నా అన్నారు. అర్హత కలిగిన యువతకు ఉద్యోగ ఉపాధుల అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటి సాధనకు నిరంతర కృషి చేయాలన్నారు. మన జీవనశైలిని బట్టి మన ఉన్నతి ఆధారపడి ఉంటుందని గుర్తు చేశారు. కళాశాల చైర్మన్ ఆచార్య వి మల్లా రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, హైదరాబాద్ నగరం భారత దేశానికే ఫార్మసీ హబ్‌గా మారిందని తెలియజేశారు. ప్రిన్సిపల్ డా మంజునాథ్, డైరెక్టర్లు డా ఏడెల్లి మల్లారెడ్డి, కె. శశిధర్ రెడ్డి, కె. రామచంద్రమ్, కె రమేష్, బైరయ్య, అధ్యాపక బృందం, 200 విద్యార్థినులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# దక్షిణ కాశీలో పోటెత్తిన భక్తజనం.

కామారెడ్డి, నవంబర్ 15: కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండల కేంద్రంలో గల దక్షిణ కాశీగా పేరు పొందిన సిద్ధిరామేశ్వర ఆలయంలో ఈ రోజు భక్తులు పోటెత్తారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పలు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

ఆలయంలో గల మూలబావి నీటితో భక్తులు తల స్నానాలు చేశారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. అభిషేకాల అనంతరం పలువురు జంటలు సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వాన అధికారి శ్రీధర్ ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను దర్శించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 15:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ రేపు గుజరాత్‌లో పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి సూరత "లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను సందర్శిస్తారు. ముంబయి–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్ కారిడార్ పురోగతినీ ఆయన సమీక్షిస్తారు. ఇది భారత అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఒకటి. ఈ ప్రాజెక్టు ద్వారా దేశం హై–స్పీడ్ కనెక్టివిటీ యుగంలోకి అడుగుపెడుతోంది.

సుమారు 508 కిలోమీటర్లు విస్తరించిన ఈ ప్రాజెక్ట్... గుజరాత్, దాద్రా–నగర్ హవేలీలలో 352 కిలోమీటర్లు, మహారాష్ట్రలో 156 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ కారిడార్ సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదర, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబయి వంటి ప్రధాన నగరాలను కలుపుతుంది. భారత రవాణా మౌలిక సదుపాయాల్లో ఒక పరివర్తనాత్మక ముందడుగును ఇది సూచిస్తుంది.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అధునాతన ఇంజనీరింగ్ పద్ధతులతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ 465 కిలోమీటర్లు (దాదాపు 85 శాతం మార్గం) వయాడక్ట్‌లపై ఉంది. తద్వారా ఇది తక్కువ భూసంబంధ అంతరాయాలు, మెరుగైన భద్రతను నిర్ధరిస్తుంది. ఇప్పటివరకు 326 కిలోమీటర్ల వయాడక్ట్ పనులు పూర్తయ్యాయి. 25 నది వంతెనలకు గానూ 17 వంతెనల నిర్మాణమూ ఇప్పటికే పూర్తయింది.

బుల్లెట్ రైలు అందుబాటులోకి రావడం ద్వారా ముంబయి–అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం దాదాపు రెండు గంటలకు తగ్గుతుంది. నగరాల మధ్య ప్రయాణాన్ని వేగవంతం, సులభతరం, మరింత సౌకర్యవంతంగా చేయడం ద్వారా ఈ ప్రాజెక్ట్ విప్లవాత్మకంగా మారుతుంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం కారిడార్‌లో వ్యాపారం, పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధినీ ఇది వేగవంతం చేస్తుందని భావిస్తున్నారు.

దాదాపు 47 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన సూరత్– బిలిమోరా విభాగం పనులు చివరి దశకు చేరాయి. సివిల్ పనులు, ట్రాక్–బెడ్ నిర్మాణం పూర్తయ్యాయి. నగరంలోని ప్రపంచ ప్రఖ్యాత వజ్రాల పరిశ్రమ స్ఫూర్తిగా సూరత్ స్టేషన్ నమూనాకు రూపకల్పన చేశారు. ప్రయాణికుల సౌకర్యంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ ఈ స్టేషన్ నమూనాను రూపొందించారు. ఇందులో విశాలమైన వెయిటింగ్ లాంజ్‌లు, రెస్ట్‌రూమ్‌లు, రిటైల్ అవుట్‌లెట్‌లు ఉన్నాయి. సూరత్ మెట్రో, సిటీ బస్సులు, భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో సజావైన మల్టీ–మోడల్ కనెక్టివిటీనీ ఇది అందిస్తుంది.

# గిరిజన ఆత్మగౌరవ దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నర్మద జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన

న్యూఢిల్లీ, నవంబర్ 15:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవంబరు 15న గుజరాత్‌లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12:45 గంటల ప్రాంతంలో నర్మద జిల్లాలోని దేవ్‌మోగ్రా ఆలయంలో దైవదర్శనం, పూజలు చేస్తారు. ఆ తర్వాత 2:45 గంటలకు దేడియాపడను సందర్శించి, ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలలో పాల్గొంటారు. అలాగే, మౌలిక సదుపాయాల కల్పన సహా ?9,700 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ నిర్వహించే సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

దేడియాపడ కార్యక్రమాల్లో భాగంగా ఆయన, గిరిజన సముద్ధరణ సహా ఈ ప్రాంతంలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఉద్దేశించిన అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్నిటికి శంకుస్థాపన చేస్తారు.

ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ (పీఎం–జన్మాన్), ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ–జేఏజీయూఏ)ల కింద నిర్మించిన 1,00,000 ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలోనూ ప్రధానమంత్రి పాల్గొంటారు.

గిరిజన విద్యార్థుల కోసం సుమారు 1,900 కోట్లతో నిర్మించిన 42 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల (ఈఎంఆర్ఎస్)లను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దీంతోపాటు సామాజిక నేతృత్వ కార్యకలాపాల కూడలిగా ఉపయోగపడే 228 బహుళార్థ సాధక కేంద్రాలను, అస్సాంలోని దిబ్రూగఢ్‌లోగల వైద్య కళాశాలలోని 'సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్', మణిపూర్‌లోని ఇంఫాల్‌లో గిరిజన సంస్కృతి–వారసత్వ పరిరక్షణకు ఉద్దేశించిన 'ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (టీఆర్ఐ) భవనం సహా గిరిజన ప్రాంతాల్లో అనుసంధానాన్ని మెరుగు పరిచేలా గుజరాత్‌లోని 14 గిరిజన జిల్లాలకు 250 బస్సులను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

గిరిజన ప్రాంతాల అనుసంధానాన్ని మెరుగు పరిచే లక్ష్యంగా 748 కిలోమీటర్ల కొత్త రహదారులతో పాటు 'డీఏ–జేఏజీయూఏ' కింద సామాజిక కూడళ్లుగా పనిచేసే 14 ట్రైబల్ మల్టీ–మార్కెటింగ్ సెంటర్ల (టీఎంఎంసీ) నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. మరోవైపు గిరిజన బాలలకు నాణ్యమైన విద్యా ప్రదానంపై ప్రభుత్వ నిబద్ధతను కొనసాగిస్తూ ?2,320 కోట్లకుపైగా విలువైన 50 కొత్త 'ఈఎంఆర్ఎస్'లకూ ఆయన పునాదిరాయి వేస్తారు.

# ద్వైపాక్షిక యంత్రాంగాన్ని తిరిగి సక్రియం చేయాలని పియూష్ గోయల్ పిలుపునిచ్చారు; వెనిజులా కీలకమైన ఖనిజాలు, భారతీయ పెట్టుబడులపై దృష్టి సారించింది

విశాఖపట్నంలో 2025 నవంబర్ 14–15 తేదీలలో జరిగిన 30వ అఐఐ భాగస్వామ్య శిఖరాగ్ర సమావేశం సందర్భంగా కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి శ్రీ పియూష్ గోయల్, వెనిజులా పర్యావరణ మైనింగ్ అభివృద్ధి మంత్రి శ్రీ హెక్టర్ సిల్వాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.

సమావేశంలో, కీలకమైన ఖనిజాలలో సహకారం మరియు భారతీయ పెట్టుబడులను ఆకర్షించడం వంటి చమురు రంగానికి మించి భారతదేశంతో ఆర్థిక సంబంధాన్ని విస్తరించడంలో వెనిజులా వైపు ఆసక్తిని వ్యక్తం చేసింది.

దశాబ్దం క్రితం చివరి సమావేశం జరిగిన భారతదేశం–వెనిజులా జాయింట్ కమిటీ యంత్రాంగాన్ని తిరిగి సక్రియం చేయవలసిన అవసరాన్ని శ్రీ గోయల్ నొక్కి చెప్పారు. వెనిజులాలో ఎౌఅఅ కొనసాగుతున్న కార్యకలాపాలు మైనింగ్ మరియు అన్వేషణలో లోతైన సహకారానికి అవకాశాన్ని కల్పిస్తాయని ఆయన గుర్తించారు.

# పటేల్ స్ఫూర్తి కోసం కృషి చేద్దాం

## –పటేల్ స్ఫూర్తి కోసం కృషి చేద్దాం
## –గుజరాత్ ఎంపీ డాక్టర్ ఫార్మర్ యశ్వంత్ సింగ్ పిలుపు




నాగర్ కర్నూల్, నవంబర్ 15: భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన అనంతరం దేశంలో ఉన్న 560 కి పైగా స్వతంత్ర రాజ్యాలను తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సామంత రాజులను భారతదేశంలో విలీనం చేసి భారతదేశం ఐక్యతను పటిష్టపరిచారని, అదే స్ఫూర్తితో మనమంతా కూడా భారత దేశంలో ఏకతాను సాధించేందుకు కృషి చేద్దామని గుజరాత్ రాష్ట్రానికి చెందిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఫార్మర్ యశ్వంత్ సింగ్ యువతకు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం స్థానిక బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, అనంతరం భారతదేశ ఐక్యతను చాటి చెప్పిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను యావత్ భారత దేశంలో సంవత్సరం పొడవునా నిర్వహించాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించి అక్టోబర్ 26న ప్రారంభించారని తెలిపారు.

నేటి యువతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశం ఐక్యతను చాటి చెప్పేందుకు చేసిన కృషిని వివరించేందుకే సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను భారత యువజన క్రీడామంత్రిత్వశాఖ ద్వారా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత భారత ఐక్యతను కొనసాగిస్తూ 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ ఆర్థిక సంపన్న దేశంగా తీర్చిదిద్దేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని అందులో మనమంతా కూడా భాగస్వాములై ఐక్య భారతదేశం ఆత్మ నిర్భర దీక్షిత్ భారత్ గా మార్చేందుకు మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావుమాట్లాడుతూ అభివృద్ధికే బీహార్ ప్రజలు పట్టం కట్టారని, వారసత్వ రాజకీయాలకు, జంగిల్ రాజ్యానికి తాము వ్యతిరేకమని అభివృద్ధికి మద్దతిస్తామంటూ తీర్పు ఇచ్చారని, ఇకమీదట రాబోయే ఏ ఎన్నికల్లో కూడా ప్రజలు ఇదే తీర్పును ఇస్తారనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ చేపట్టిన అభివృద్ధి ఫలాలు నాగర్కర్నూల్ జిల్లాలో కూడా కొనసాగుతున్నాయని వివరించారు.

జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారులైన 167కే, జడ్చర్ల కోదాడ తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మన్ననూర్ శ్రీశైలం కారిడార్ జాతీయ రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చి నిధులు మంజూరు చేసిందని త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. డోర్నకల్ గద్వాల రైల్వే లైన్ సర్వే తుది దశకు వచ్చిందని త్వరలోనే ఇట్టి పనులకు కూడా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చి నిధులు మంజూరు చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వ్యవసాయం తోపాటు అనుబంధ రంగాలను అభివృద్ధిపరిచి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి దన్,ధాన్య కృషి యోజన పథకం అమలు కోసం ఉమ్మడి జిల్లాలోని నాగర్ కర్నూల్ గద్వాల నారాయణపేట జిల్లాలను ఎంపిక చేసిందని జిల్లాలో ప్రతి సంవత్సరం 240 కోట్లు చొప్పున నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ పథకం అమలు కోసం జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిందని ఇట్టి పనులను పర్యవేక్షించి, రైతులకు ప్రభుత్వ ఫలాలు అందించే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు కేంద్ర ప్రభుత్వ స్థాయి ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించి పర్యవేక్షించే బాధ్యతను అప్పగించారని తెలిపారు. రాబోయే రోజుల్లో పశ్చిమబెంగాల్ తెలంగాణ రాష్ట్రాలలో బిజెపి అధికారంలోకి వచ్చే విధంగా సంస్థగతంగా బలోపేతం చేసేందుకు జాతీయ నాయకత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పంజగుల నాగేంద్రం గౌడ్, నాయకులు పోల్ దాస్ రాము, ప్రమోద్ కుమార్ , చందు, పదిర భీమేష్ , సూరంపల్లి సుధాకర్ కొమ్ముల సత్యనారాయణ ,వెంకటేష్ ,శివ, సూరిబాబు, బాలస్వామి, అలా రాజు తదితరులు పాల్గొన్నారు.


మంజీరా రచయితల సంఘం
ఆహ్వానం



నందిని సిధారెడ్డి
నవల
నాగటి తరం
ఆవిష్కరణ సభ
16 నవంబర్ 2025,
ఆదివారం ఉ. 10 గంటలకు
బందారం గ్రామం
సిద్దిపేట జిల్లా

ఆహ్వానం : సర్ర భగవాన్ రెడ్డి
సభాధ్యక్షులు : జైన దేవదాసు
ఆవిష్కరణ : వాసిరెడ్డి నవీన్
సమీక్ష : నాళేశ్వరం శంకరం
ఆత్మీయ అతిథులు : దేవీప్రసాద్
దేశపతి శ్రీనివాస్
విరాహత్ అలీ
సక్క యాదవ రెడ్డి
కందుకూరి శ్రీరాములు
బేకులపల్లి గోపాల్ రెడ్డి
కొమురవెల్లి అంజయ్య
సిహెచ్. బాల్ నర్సయ్య
కె. రంగాచారి
ఎన్. మల్లారెడ్డి
కృతజ్ఞతలు : సిద్దెంకి గిరి


# పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం



ఏటూర్ నాగారం,నవంబర్ 15: ఏటూరు నాగారం మండల కేంద్రంలోని కొమరం భీమ్ జంక్షన్‌లో ఈ రోజు ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రతిమకు ఘనంగా నివాళులు అర్పించారు.

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు చందా మహేష్ మాట్లాడుతూ.. "పాతికేళ్ల వయస్సులోనే బిర్సా ముండా ఆంగ్లేయులపై పిడికిలి బిగించి ధైర్యసాహసాలతో పోరాటం చేసిన గొప్ప వీరుడు అన్నారు.

గిరిజనుల భూమి, నీరు, అటవీ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు నేటికీ ఆదర్శప్రాయాలు" అని పేర్కొన్నారు. ఆయనతో పాటు అనేక గిరిజన వీరుల గాథలను వెలుగులోకి తేవడం, వారి సేవలను స్మరించుకోవడం సమాజం ప్రతి తరానికి అవసరమని అన్నారు.

రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా గిరిజన వీరులు స్వాతంత్ర్యం కోసం, సంప్రదాయాల పరిరక్షణ కోసం విశేషంగా పోరాడారని గుర్తుచేశారు. ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొటె రవి మాట్లాడుతూ.. 1875 నవంబర్ 15న జన్మించిన బిర్సా ముండా జర్మన్ మిషన్ స్కూలులో విద్యనభ్యసించి పాశ్చాత్య చరిత్ర ద్వారా బ్రిటిష్ పాలకుల అణచివేత గురించి అవగాహన పొందారని తెలిపారు.

1894లో ఆంగ్లేయుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించిన ఆయన, 1899లో సాయుధ పోరాటం చేపట్టి అనేక ఠాణాలు, భూస్వాముల ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేసి బ్రిటిష్ పాలకులకు సింహస్వప్నమయ్యారని అన్నారు. 1900 జూన్ 9న జైలులో తుదిశ్వాస విడిచిన బిర్సా ముండా పేరు ఆదివాసీ సమాజాల్లో నేటికీ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

అదే సమయంలో విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు, భూ హక్కుల విషయంలో ఆదివాసీలు నేటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బిర్సా ముండా గాథలు పాఠ్యాంశాల్లో భాగం కావాలని, ఆదివాసీ ప్రాంతాల్లో స్వయం నిర్ణయాధికారాన్ని ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమరం లక్ష్మీకాంత ఆదివాసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు చేరుకుల ధర్మయ్య, ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు అన్నవరం వెంకటేశ్వర్లు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కాపుల సమ్మయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు పొడిశెట్టి అనసూయ, తుడుందెబ్బ నాయకులు మడప వెంకటేష్, చందా గణేష్,కోటేశ్వర రావు, మల్లెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిర్సా ముండా జయంతి వేడుకలు

హైదరాబాద్, నవంబర్ 15:దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో గిరిజన వీరుడు బిర్సా ముండా జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, నాయకులు అడయి కాంతరావు, తొడసం జంగు, హనుమంతరావు, లచ్చు పటేల్, లక్ష్మణ్, మారు, భీమయ్య, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత యజ్ఞం..

వరంగల్, నవంబర్ 15:వరంగల్ నగరంలోని 40వ డివిజన్‌లో పరిశుభ్రత, పచ్చదనం పెంపు లక్ష్యంగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి పిలుపు మేరకు ఈ రోజు కరీమాబాదలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛత పాఠశాల' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. డివిజన్ పరిసరాలలో ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత కోసం శ్రమదానం చేయాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు.

ఆయనే స్వయంగా ముందుండి కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేసి, పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ సంస్థలలో, పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించడం కేవలం సిబ్బంది బాధ్యత కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. ఈ శ్రమదానం ద్వారా పాఠశాల పరిసరాలు శుభ్రంగా, హరితంగా మారాయి.

ఇలాంటి సామూహిక ప్రయత్నాలు ప్రజల్లో సాఫల్య భావనను, సామాజిక బాధ్యతను పెంచుతాయి అన్నారు. భవిష్యత్తులో కూడా డివిజన్ పరిధిలో ఇలాంటి స్వచ్ఛత కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ఆఫ్ చైర్మన్ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. మాధవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల బోధనేతర సిబ్బంది, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, మున్సిపల్ పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

# అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన ఎస్సై

ఆదిలాబాద్, నవంబర్ 15: చనిపోతానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి, అటవీప్రాంతంలో అపస్మారక స్థితిలో ఉండగా కాపాడి ఆసుపత్రికి తరలించి తన విధుల పట్ల నిబద్ధతను చాటుకున్నారు మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ ఎస్సై గంగారాం

కాల్వల తిరుపతి అనే వ్యక్తి భార్యతో గొడవ పడి తాను చచ్చిపోతానని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో వెతికినా కనిపించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వెంటనే స్పందించిన ఎస్సై గంగారాం సాంకేతిక పరిజ్ఞానంతో గంట వ్యవధిలోనే ఆచూకి కనిపెట్టారు. దేవాపూర్‌లోని సల్పాలవాగు సమీప అటవీ ప్రాంతంలో ఉన్నాడని గుర్తించి తన సిబ్బందితో అక్కడికి వెళ్లారు. అటవీ ప్రాంతంలో చెట్టు కింద అపస్మారక స్థితిలో పడి ఉన్న తిరుపతిని అక్కడి నుంచి తరలించి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన ఎస్సై గంగారాం సేవలను పలువురు కొనియాడారు.

# విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం సృష్టించడమే స్యాక్ టెక్నాలజీస్ లక్ష్యం



హైదరాబాద్, నవంబర్ 15: తెలంగాణ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం అందించే దిశగా సఖి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ యత్నిస్తోంది. ఈ క్రమంలోనే గురుకులాల్లో మానిక వ్యర్థ నిర్వహణను ప్రోత్సహించే దిశగా.. స్మోక్‌లెస్ సైకిల్ పాత్ టు జీరో వెస్ట్ అనే కార్యక్రమాన్ని నార్సింగిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రారంభించారు. ఈ పర్యావరణ హితమైన యూనిట్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు.

స్మోక్‌లెస్ సైకిల్ - పాత్ టు జీరో వెస్ట్ అనే కార్యక్రమాన్ని నార్సింగి మున్సిపల్ కార్పొరేషన్‌తో కలిసి కేజీ రెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, వరంగల్‌కు చెందిన ఎన్ఆర్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ మద్దతుతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టీ కృష్ణమోహన్ హాజరై విద్యార్థినుల ఆరోగ్యం, పర్యావరణ రక్షణకు మద్దతుగా స్మోక్ ఫ్రీ, ఎమిషన్ కంట్రోల్ పరిష్కారాన్ని అందించినందుకు స్యాక్ టెక్నాలజీస్‌కు అభినందలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సఖి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు టూటి సంధ్య, సహ వ్యవస్థాపకురాళ్లు వి వర్షిత, వి జాహ్నవి, సహ వ్యవస్థాపకుడు ఏ రాకేశ్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్న కుమార్‌తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ వీ సుజాత, సిబ్బంది, విద్యార్థినులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్మోక్‌లెస్ సైకిల్ ప్రోగ్రామ్ పాఠశాలలో మాసిక వ్యర్థ నిర్వహణను సులభతరం చేస్తుందని, విద్యార్థుల కోసం మరింత సురక్షితమైన వాతావరణాన్ని సృష్టిస్తుందని ఆమె అభినందించారు. సమాజ శ్రేయస్సు కోసం వినూత్న పరిష్కారాలను అందించే స్యాక్ టెక్నాలజీస్ సామాజిక బాధ్యతకు ఇది ఒక ప్రేరణాత్మక ఉదాహరణగా నిలిచిందని ఆమె ప్రశంసించారు

# అయ్యప్ప స్వాములకు అన్నసంతర్పణ...



చౌటుప్పల్, నవంబర్ 15: చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో ఉన్న శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న సంతర్పణ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు అయ్యప్ప స్వామి మాలదారులకు బైరెడ్డి పద్మావతి కుమారుడు బైరెడ్డి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి అన్న సంతర్పణ చేశారు.

వారి కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్ల వేళల ఉండాలని, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలు, అయ్యప్ప స్వామిప్రసాదించాలని అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న సంతర్పణ నిర్వాహకులు తోర్పునూరి నర్సింహ గౌడ్‌సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్, కళ్ళెం నాగరాజు, చెవగొని మహేష్, వర గంటి వెంకటేష్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందొజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, తోర్పునూరి సాయి, సాయిలు, శివ ప్రసాద్, ఆలయం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి, ఆలయం కమిటీ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల బెడద నివారించాలి

అమరావతి, నవంబర్ 15: కుక్కల బెడదను నివారించాలని మండలంలోని తర్నికల్ గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయాందోళన కు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధానంగా వృద్ధులు, చిన్నపిల్లలు కుక్కల భయానికి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. వెంటనే చర్యలు చేపట్టాలని కార్యదర్శిని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో తాళ్ల సురేష్ గౌడ్, వర్కాల దేవయ్య, బచ్చలకూర శ్రీశైలం, అంతారం బక్కయ్య, గొడుగు వెంకటేష్, జంపుల సాయి బాబు ఉన్నారు.

# పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పునరుద్ధరణకు చర్యలు : కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొండమల్లేపల్లి, నవంబర్ 15 : గత నెల కురిసిన భారీ వర్షాల కారణంగా పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (చెరువు) కింద దెబ్బతిన్న పనులన్నింటినీ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం ఆమె ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పాత చెరువు) ను పరిశీలించారు. ఒకటవ వీయర్ నుండి 5వ వీయర్ వరకు కాలి నడకన పర్యటిస్తూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద వర్షాలకు తెగిపోయిన కాలువలు, దెబ్బతిన్న రహదారి, కట్ట పరిస్థితిని పరిశీలించారు. భారీ వర్షాల కారణ ంగా రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి పేర్వాల రిజర్వాయర్ నిండి పొంగి ప్రవహించి ప్రమాద స్థాయికి చేరుకోగా దానికి అనుకుని ఉన్న హీర్యా తండా, సింగ్యా తండా ప్రజలను ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద దెబ్బతిన్న పనుల పునరుద్ధరణకు జిల్లా యంత్రాంగం ఎఫ్ డి ఆర్ కింద ప్రతిపాదనలు పంపడం జరిగింది. అయితే భారీ వర్షానికి తెగిపోయిన, దెబ్బతిన్న కాలువలు, కట్టతో పాటు, కట్టమీద నుండి హీర్యా తండా, సింగ్యా తండా, అలాగే మరో రెండు తండాలైన గుడి తండా, కారోబార్ తాండాలు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ స్థిరీకరణ, సామర్థ్యం, ఎత్తు పెంచితే మునకకు గురయ్యే విస్తీర్ణం, గ్రామాలు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా పెండ్లిపాకల రిజర్వాయర్ కింద దెబ్బతిన్న కాలువలు, కట్ట,రహదారి పనులన్నింటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రిజర్వాయర్ ఎత్తు పెంపునకు రూ. 1,204 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తు పెంచి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకుగాను రూ. 1,204 కోట్లుతో పరిపాలన అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2,771 ఎకరాలు భూసేకరణ అవసరం కాగా, ఇప్పటివరకు 1,917 ఎకరాలు పూర్తి చేయడం జరిగింది. 854 ఎకరాలకు అవార్డు పాస్ అయినప్పటికీ చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ పూర్తయితే గ్రావిటీ ద్వారా నల్లగొండ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవకాశం కలుగుతుంది.

నీటి నిల్వ సామర్థ్యం పెంపుతో నాలుగు తండాలు మునక

పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పాత) నీటి నిల్వ సామర్థ్యం 251.5 ఎఫ్ఆర్ఎల్‌గా ఉంది. ప్రస్తుతం గుడి తండా, కారోబార్ తండా, హిర్యా తండా, సింగ్యా తండా పూర్తి రిజర్వాయర్ సామర్థ్యానికి బయట ఉన్నాయి. అయితే కట్ట సామర్థ్యాన్ని పెంచి నీటి నిలువ సామర్థ్యం పెంచితే ఇవన్నీ మునకకు గురయ్యే అవకాశం ఉందని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం పెండ్లిపాకల రిజర్వాయర్ సామర్థ్యం 0.54 టీఎంసీల మేర ఉండగా దీనిని 2.2 టీఎంసీలకు పెంచినట్లయితే ఈ నాలుగు తండాలు మునకకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ భద్రు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నెహ్రూ నాయక్, డీఈ రాములు, ఏఈఈ భాస్కర్ రావు, శ్రవణ్, సతీశ్ పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి..

## -శ్రీగణేష్ ఫౌండేషన్ అధినేత ముకుల్

హైదరాబాద్, నవంబర్ 15: దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టి, బ్రిటిష్ పాలన నుంచి విముక్తుల్ని చేసిన భారత మహనీయుల స్ఫూర్తిని నేటి బాలలు అలవర్చుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకొని మంచి భారత పౌరులుగా తయారుకావాలని గణేష్ ఫౌండేషన్ అధినేత ఎన్. ముకుల్ సూచించారు.

ఈ నేపథ్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ జయంతి ఉత్సవాల్లో భాగంగా, శనివారం 3వ వార్డు పరిధిలోని కార్ఖానా గన్ రాక్ స్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ముకుల్ ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ముకుల్ మాట్లా డుతూ.. మహనీయుల స్ఫూర్తితో ప్రతి విద్యార్థి దేశభక్తిని అలవర్చుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకుని దేశానికి ఉపయోగకరంగా తయారుకావాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఈ దిశగా నేటి బాలలకు పాఠశాలలలోనే ప్రాథమిక దశ నుంచే సరైన అవగాహన కల్పించాలని సూచించారు.

# మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి

అచ్చంపేట, నవంబర్ 15: అచ్చంపేట పట్టణంలోని మహేంద్ర నగర్ కాలనీలో ఉన్న వికలాంగుల భవనంలో ఈ రోజు బోరు వేయించే కార్యక్రమాన్ని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు పూజ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ, వికలాంగులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని, భవనంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ కౌన్సిలర్ బాబా, వికలాంగుల సంఘం ప్రతినిధులు కుమార్ పాల్గొని పూజ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మున్సిపల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిష్టాపన విగ్రహాల ఊరేగింపు..

అమరావతి, నవంబర్ 15:గాంధారి మండలంలోని తిప్పారం తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో ప్రతిష్టించనున్న విగ్రహాలను ఈ రోజు గాంధారి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. తిప్పారం తండాలో దాదాపు ఐదు కోట్ల రూపాయల వ్యయంతో శ్రీ కోదండ రామాలయాన్ని నిర్మించారు.

నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్టించనున్న సీతారాముల విగ్రహాలతో పాటు, లక్ష్మణుడు, ఆంజనేయునివిగ్రహాలను తిరుపతి సమీపంలో తయారు చేయించి ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. తీసుకు వచ్చిన విగ్రహాలను తండా వాసులు గాంధారి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తిప్పారం తండా వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తిప్పారం తండా వాసులు కాషాయపు జెండాలు పట్టుకొని, జై శ్రీరామ్ అనే నినాదాలు చేస్తూ ఆలయంలో ప్రతిష్టించనున్న విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, గాంధారి ఎస్సై ఆంజనేయులు పోలీస్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు బాపూరావు మహారాజ్‌తండా మాజీ సర్పంచ్ బిషన్ నాయక్, తాన్ సింగ్ నాయక్, గంగారం, పెంటయ్య తో పాటు తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పుస్తకం హస్త భూషణం

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్

నల్గొండ, నవంబర్ 15: పుస్తకం హస్త భూషణం అని, పుస్తకం చదవడం ద్వారా కలిగే ప్రత్యక్ష అనుభవం ఎంతో అనుభూతిని ఇస్తుందని నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్ అన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి వస్తువు, ప్రతి పుస్తకం విలువైనదని, గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠకులకు ఏ విధమైన పుస్తకాలు కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. గ్రంథాలయానికి ఇంటర్ నెట్, వై ఫై సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు.

జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎన్.పద్మ మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం వల్ల మన జ్ఞానం పెంపొందుతుందన్నారు. ప్రపంచ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి తెలుసుకునేందుకు పుస్తకాలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ మాట్లాడుతూ.. లైబ్రరీ అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తానని తెలిపారు. విద్యా, వైజ్ఞానిక పుస్తకాలను పాఠకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర నాయకుడు ఎన్.వేణుగోపాలాచార్యులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

# మాధారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మం, నవంబర్ 15:కారేపల్లి మండలం మాధారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోసైటీ పాలకవర్గం శనివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మొక్కజొన్న పంట అధికంగా పండిస్తున్న మాధారం ప్రాంతంలో కొనుగోలు కేంద్రం కావాలని సోసైటీ పాలకవర్గం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ దృష్టికి తెచ్చి ఎమ్మెల్యే సహకారంతో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి మండలంలో విశ్వనాథపల్లి, మాధారం, ఎర్రబోడు, సింగరేణి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ఐకేపీ, సోసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సోసైటీ ఉపాధ్యక్షుడు దారావత్ మంగిలాల్, డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, కొత్తూరి రామారావు, కార్యదర్శి బల్లు హనుమంతరావు, ఏఈఓ చంద్రకళ, మాజీ ఎంపీటీసీ భాగం రూపా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ అజ్మీర నరేశ్, రైతు ప్రతినిధులు బానోత్ రాంమూర్తి , కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిలారి అప్పారావు, రైతు నాయకులు బానోత్ రాంమ్మూర్తి, ఇమ్మడి తిరుపతిరావు, రైతులు భాగం వెంకటప్పారావు, భాగం నాగేశ్వరరావు, కాసాని లక్ష్మినారాయణ, పాపినేని నాగేశ్వరరావు, అంగోత్ మత్రు, రఘు, మంకిన్ని చిన్న సైదయ్య, పిల్లలమర్రి వీరన్న, జాటోత్ వీరన్న, కుర్ర శ్రీను, గుర్రం నర్సింహరావు, తొగరు శ్రీను పాల్గొన్నారు.

# కొమ్ము కిషన్ మరణం తీరని లోటు.. బాధిత కుటుంబాల పరామర్శలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



మెదక్, నవంబర్ 15: తెలంగాణ ఉద్యమ కారుడు, ఘనపూర్‌కు చెందిన కొమ్ము కిషన్ అకాల మరణం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఘనపూర్ లో ఇటీవల మరణించిన కొమ్ము కిషన్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో మొదటి నుండి పనిచేసిన కొమ్ము కిషన్ జైలుకు సైతం వెళ్లాడని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పలువురు బాధిత కుటుంబాలకు పరామర్శ..

ఘనపూర్‌లో ఇటీవల యాటెల్లి రాజు తండ్రి మరణించడంతో రాజు వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఇటీవల ప్రమాదానికి గురైన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త మంగలి యాదగిరిని, రాంపూర్‌లో ఇటీవల మరణించిన బిఆర్ఎస్ యువ నాయకుడు తోయేటి వెంకటేశం కుటుంబాన్ని, అప్పనపల్లి రాములు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి కుటుంబాలకి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సొసైటీ చైర్మన్ హరికృష్ణ రెడ్డిని గుడికందులలో ఎమ్మెల్యే పరామర్శించారు. హరికృష్ణ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మరోవైపు అదే గ్రామానికి చెందిన ఇటీవల వివాహం చేసుకున్న కొక్కొండ నాగార్జున రెడ్డి అఖిల దంపతులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆశీర్వదించారు. గ్రామంలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పరిశీలించారు.

బాలికల గురుకుల కళాశాలలో ఆకస్మిక తనిఖీ..

రాంపూర్‌లోని బాలికల గురుకుల కళాశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్యార్థులకు సరైన విద్య భోజనం వసతులు అందుతున్నాయా అని ఆరా తీశారు ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న విద్యుత్ తాగునీటి క్రీడాస్థల సమస్యలను ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థినిలు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, నాయకులు చిలువేరి మల్లారెడ్డి, సుకూరి లింగం, బాలరాజు, బోధనం కనకయ్య, సుతారి రమేష్, కొమ్ము శరత్, కుర్మ యాదగిరి, బాలరాజు, ఎల్లం,, శ్రీనివాస్ గౌడ్, మంగ నర్సింలు, యాదగిరి, అశోక్, రాజిరెడ్డి, భైరాగౌడ్, బాల్ రెడ్డి, బైరారెడ్డి, జంగిడి బిక్షపతి, రాజశేఖర్, బండారు స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.

# రాజీ పడ్డట్లయితే రాజమార్గం లభిస్తుంది

చెన్నూర్, నవంబర్ 15: క్షణిక ఆవేశంలో పొరపాటు జరిగి పోలీస్ స్టేషన్ కోర్టులకు హాజరై కక్షిదారులు లోక్ ఆదాలత్‌లో రాజీ పడ్డట్లయితే రాజమార్గం లభిస్తుందని చెన్నూరు మున్సిఫ్ కోర్టు జడ్జి పర్వతపు రవి అన్నారు. ఈ రోజు స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో స్పెషల్ లోక్ ఆదాలతజడ్జి సమక్షంలో నిర్వహించారు.

లోక్ ఆదాలత్ లో మొత్తం 347కేసులు పరిశీలనకు రాగ అందులో 273, డ్రంక్ అండ్ డ్రైవ్‌న్యూసెన్స్ కేసులు 18బ్యాంక్ లావాదేవీలా పరిష్కారం జరిగాయి. 42 క్రిమినల్ కేసులు, రెండు సివిల్ కేసులు రాజీ పడడం జరిగినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, చెన్నూర్, కోటపెల్లి, జైపూర్, భీమారం, నీ ల్వాయి, పోలీస్ అధికారులు, వివిధ బ్యాంక్ ల అధికారులు పాల్గొన్నారు.

# 528 మంది విద్యార్థులకు అండగా జీఆర్‌కే ఫౌండేషన్



వరంగల్, నవంబర్ 15: గంట రవికుమార్ స్థాపించిన జీఆర్‌కే ఫౌండేషన్ ద్వారా వరంగల్ నగరంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి 528 మంది విద్యార్థులకు అండగా నిలుస్తూ, పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు జీఆర్‌కే ఫౌండేషన్ ముందుకు వచ్చింది.

ఈ మేరకు వరంగల్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే సుమారు 528 మంది టెన్త్‌క్లాస్ విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లిస్తూ ఫౌండేషన్ నుంచి చెక్కులను అందించినట్టు ఎండి రఫీ తెలిపారు. ఈ రోజు జీఆర్‌కే ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. తమవంతు సాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని గంట రవికుమార్ ఆకాంక్షించారని, చదవుకు పేదరికం అడ్డుకారాదని, నిరుపేద విద్యార్థుల్నిఆదుకునేందుకు తనవంతు సహకారం చేస్తానని, జీఆర్‌కే ఫౌండేషన్ కూడా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

వరంగల్ నగరంలోని పాఠశాలల టెన్త్ విద్యార్థుల ఫీజు చెల్లించేందుకు సంబంధిత చెక్కులను పాఠశాలల హెచ్ఎంలకు అందించినట్టు తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ నుండి 8, 9, 10వ తరగతులు చదివే పేద, ఉత్తమ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత ట్యూషన్‌కి శ్రీకారం చుట్టారని జీఆర్‌కే ఫౌండేషన్ సభ్యులు వెల్లడించారు.

